
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 కనిష్ఠం 19.6

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 'బెస్ట్' అవార్డు

శంషాబాద్ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ అడ్మినిస్ట్రేషన్ అంశాలలో బెస్ట్ ఎయిర్‌పోర్టు అవార్డు వరించింది. ఈమేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అవార్డును ప్రదానం చేసినట్లు జీఎంఆర్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సందడే సందడి



గాల్లో తేలినట్లుందే..

విమానాలు, హెలికాప్టర్లు కనువిందు చేశాయి. సారంగ్ బృందం ఆకాశంలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దూరం నుంచే వీటిని చూడాల్సి రావడంతో కొంత అసంతృప్తి ఉన్నా.. మొత్తంగా వింగ్స్ ఇండియా-2024 ఏవియేషన్ షో మూడో రోజు శనివారం నగరవాసులకు కొత్త అనుభూతిని మిగిల్చింది. రెండు రోజులపాటు వ్యాపార వేత్తలకే పరిమితమైన షోలో శనివారం సామాన్యులకు ప్రవేశం కల్పించారు. దీంతో పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చారు. విమానాలు.. అవి చేసే విన్యాసాలు చూసి కేరింతలు కొట్టారు. పెర్క్యూనిస్ట్ శివమణి ప్రదర్శనతో సందర్శకులు తన్మయత్వానికి లోనయ్యారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



శివమణి సంగీత ప్రదర్శన





చిన్నారితో..

సెల్‌ఫోన్‌లో బంధిస్తూ..



ఏవియేషన్ షో చూసేందుకు తరలి వస్తున్న విద్యార్థినులు

పత్తాలేని ఈవినింగ్ క్లినిక్స్

- తొలుత హడావిడిగా ఏర్పాటు
- ఆ తర్వాత పట్టింపులేని వైనం



హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, మధ్యతరగతి వారికి పైసా ఖర్చు లేకుండా వైద్యమందించే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏడాది కిందట ఏర్పాటు చేసిన ఈవినింగ్ క్లినిక్స్ (సాయంత్రపు దవాఖానాలు) మూతబడ్డాయి. రోగుల నుంచి ఆదరణ బాగానే ఉన్నా చిత్తశుద్ధి కొరవడి వీటిని మూసివేసినట్లు తెలుస్తోంది. నగరంలో పేరుగాంచిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గించేందుకు ఏరియా ఆస్పత్రులు, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ఈవినింగ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు వైద్యులు, స్పెషలిస్టులు రోగులను పరీక్షించేవారు. ఒక్కోరోజు ముఖ్యమైన విభాగాలకు చెందిన వైద్యులు వచ్చి రోగులను పరిశీలించేవారు. ప్రభుత్వ వైద్యులు, ఇతర వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించి సేవలందించారు. రెండునెలల క్రితం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో ఈ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

చక్కని ఆదరణ..

సాయంత్రం పూట అనారోగ్య సమస్య వస్తే వెంటనే ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా రోగులకు ఇబ్బంది లేకుండా ఈ క్లినిక్స్ ఉపయోగపడ్డాయి. ప్రత్యేక ఇబ్బందులను వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం అందించడంతో తొలినాళ్లలో ఈ క్లినిక్‌లకు ఆదరణ లభించింది. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే చాలామంది వైద్యసేవలు పొందే వారు.

కన్సల్టేషన్‌కే రూ.500-1000

ఈవినింగ్ క్లినిక్స్ మూతపడడంతో ఇప్పుడు చాలామంది రోగులు పెద్దాస్పత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లకు పరుగులు పెడుతున్నారు. ప్రైవేటులో చూపించుకోవాలంటే కనీసం రూ.500 ఫీజు చెల్లించాలి. స్పెషలిస్ట్ అయితే రూ.వెయ్యివరకు వెచ్చించాలి. టెస్ట్‌లు, మందుల ఖర్చు అదనపు భారమయ్యాయి.

మళ్లీ తెరిపించాలి..

ఈవినింగ్ క్లినిక్‌లపై కొంతకాలంపాటు మంత్రి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ బాగానే ఉండేది. ఆ తర్వాత తగ్గిపోయింది. దీంతో ఓపీకి వచ్చే వైద్యుల సంఖ్య కూడా తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడం, కొత్త సర్కారు వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుండడంతో ఈవినింగ్ క్లినిక్‌లను తెరిపించాలని పేదలు కోరుతున్నారు.

మూసీపై బ్రిడ్జిలకు బ్రేక్..?

- ప్రారంభించని ప్రాజెక్టులు నిలిపేయాలి
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు ఆదేశాలు
- 'మూసారాం' బ్రిడ్జికి మినహాయింపు
- 55 కిలోమీటర్ల మేర అభివృద్ధికి ప్రణాళికలు
- సాధారణంగా కాకుండా ఐకానిక్ బ్రిడ్జిలు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిపై బ్రిడ్జిల నిర్మాణాలకు బ్రేక్ పడింది. వివిధ ప్రాంతాల్లో ప్రతిపాదించి, ఇప్పటికీ పనులు ప్రారంభించని బ్రిడ్జిల పనులు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే, ముసారాంబాగ్ వద్ద మూసీపై బ్రిడ్జి పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఆ ఒక్కటీ మినహాయించినట్లు సమాచారం. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీనదిని 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మూసీ అభివృద్ధి ప్రణాళికను గుణంగానే కొత్తగా బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మూసీ అభివృద్ధిపై ఎలాంటి ప్రణాళిక లేకుండా అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించిన బ్రిడ్జిలను రద్దు చేయాలని సూచించినట్లు ఓ అధికారి తెలిపారు.

మహానగరం విస్తరణలో మూసీనది వెంట పెద్దఎత్తున కాలనీలు ఏర్పాటయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్డు సైతం రద్దీగా మారాయి. దీంతో లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా గత ప్రభుత్వం రూ.350 కోట్లతో మూసీపై 12 చోట్ల బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలు సంయుక్తంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వ ఆమోదంతో టెండర్లను ఖరారు చేశారు. ఇందులో ఐదు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి హెచ్ఎండీఏ ఓ ప్రముఖ సంస్థను ఎంపిక చేసింది. జీహెచ్ఎంసీ నాలుగు బ్రిడ్జిలలో రెండు బ్రిడ్జిలకు టెండర్లను ఖరారు చేసింది. ఎన్నికలకు ముందే అక్టోబర్‌లోనే అప్పటి ప్రభుత్వం మూసీపై కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసింది.

మూసారాంబాగ్‌లో ముందుకే..

బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసి నాలుగు నెలలు కాగా, ఎన్నికలు.. ఇతర కారణాల నేపథ్యంలో ఒక్క ముసారాంబాగ్‌లో మినహా ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. ముసారాంబాగ్ వద్ద పాత బ్రిడ్జిపై ఒకవైపు రాకపోకలు నిలిపి వేసి.. పనులు చేపడుతున్నారు. ఇక్కడ ఇప్పటికే పనులు పురోగతిలో ఉన్న నేపథ్యంలో ఆ ఒక్కటీ మినహాయించి మిగిలిన బ్రిడ్జిల పనులు ప్రారంభించవద్దని జీహెచ్ఎంసీకి, హెచ్ఎండీఏకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.



లండన్‌లోని థేమ్స్ నది నమూనా

ప్రణాళికకు అనుగుణంగా బ్రిడ్జిలు..

పీపీపీ పద్ధతిలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించే అవకాశాలున్నాయి. ఈ ప్రణాళికలోనే మూసీపై ఏప్రాంతాల్లో బ్రిడ్జిలను నిర్మించాలో నిర్ణయించనున్నారు. గత ప్రభు త్వం చేసిన ప్రతిపాదనల ప్రకారం మూసీపై బ్రిడ్జిలు నిర్మిస్తే.. సుందరీకరణకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని, సుందరీకరణలో భాగంగా సాధారణ బ్రిడ్జిలు గాకుండా తీగల వంతెనల మాదిరిగా ఐకానిక్ బ్రిడ్జిలు నిర్మించాలని భావిస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం జీహెచ్ఎంసీకి కొన్ని బ్రిడ్జిలను, హెచ్ఎండీఏకు కొన్ని బ్రిడ్జిలను అప్పగించగా, కొత్త ప్రభుత్వంలో బ్రిడ్జిలన్నీ ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలోనే చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకోసం జీహెచ్ఎంసీలో పలు ఫ్లైఓవర్ల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఈని ప్రస్తుతం ఎంఆర్‌డీసీఎల్ తీసుకొచ్చారు. హెచ్ఎండీఏ, పబ్లిక్ హెల్త్ ఇలా పలు విభాగాల నుంచి ఇంజనీర్లను తీసుకుని మూసీ సుందరీకరణ పనులు పరుగులు పెట్టించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఓ అధికారి తెలిపారు.

55 కిలోమీటర్ల మేర మూసీ అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం మూసీ అభివృద్ధికి కార్యచరణ రూపొందింది. సీఎం రేవంత్‌రెడ్డి మూసీనది డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఎండీగా ఐఏఎస్ ఆమ్రపాలిని నియమించారు. సంబంధిత అధికారులతోనూ సమీక్షించారు. మూసీ నది వెంట మొత్తం 55 కిలోమీటర్ల మేర పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని, మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అందుకనుగుణంగా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు గుజరాత్‌లోని సబర్మతి నదిని, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని నదులను పరిశీలించారు. ప్రపంచ ఆర్థిక సదస్సు కోసం దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అటు నుంచి అటే లండన్ వెళ్లి. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఆమ్రపాలిలతో కలిసి థేమ్స్ నదిని పరిశీలించారు. అక్కడి అధికారులతో సమావేశమయారు. థేమ్స్ నదిని వివిధ సంస్థలను కలుపుకొని అభివృద్ధి చేసిన్నట్లుగానే మూసీనదిని అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ప్రణాళికలు రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూ 'రిటైర్డు'

వివరాల వెల్లడిలో గోప్యత

తప్పుడు నివేదికను పంపినట్లుగా అనుమానాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పనిచేస్తున్న విశ్రాంత అధికారుల, ఆచార్యుల వివరాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన ఆదేశాలను వర్సిటీ ఉన్నతాధికారులు తుంగలో తొక్కారు. జేఎన్‌టీయూతోపాటు వివిధ యూనివర్సిటీల్లో పనిచేసి రిటైరైన 25మంది ప్రొఫెసర్లు వర్సిటీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్నట్లుగా సర్కారుకు తాజాగా పంపిన నివేదికలో పేర్కొన్నారు. అయితే, నివేదికలో కేవలం టీచింగ్‌లో చేస్తున్న రిటైర్డు ఆచార్యుల వివరాలను మాత్రమే చూపిన జేఎన్‌టీయూ అధికారులు, నాన్‌టీచింగ్‌లోని రిటైర్డు అధికారుల వివరాలను మాత్రం పొందుపరచలేదు. ఆర్టీసీలో పనిచేసి రిటైరైన అధికారి ఒకరు రెండేళ్లుగా వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా, కాకతీయ వర్సిటీలో పనిచేసి రిటైరైన మరొకరు లైజన్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. వారి వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై నిషేధం ఉన్నప్పటికీ, జనవరి మొదటివారంలో ఒకరిని టెక్నికల్ ఆఫీసరు పోస్టులో నియమించడం తాజాగా వెలుగులోకి వచ్చింది. వర్సిటీ పెద్దలకు బాగా కావాల్సిన వారే ఆయా పోస్టుల్లో ఉన్నందున వారి వివరాలను ప్రభుత్వానికి పంపకపోయి ఉండొచ్చని ఉద్యోగసంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

వారి వివరాలు పంపలేదు: రిజిస్ట్రార్

ప్రభుత్వానికి పంపిన నివేదికలో యూనివర్సిటీలో పనిచేస్తున్న రిటైర్డు ప్రొఫెసర్ల వివరాలను మాత్రమే పంపామని, బోధనేతర సిబ్బంది వివరాలను పంపలేదని వర్సిటీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ తెలిపారు. ఫైనాన్స్ ఆఫీసరుగా ఆర్టీసీలో రిటైరైన అధికారిని గత ప్రభుత్వమే నియమించిందని, లైజన్ ఆఫీసరును తాము కొత్తగా నియమించలేదని, ఆయన ఎప్పట్నుంచో కొనసాగుతున్నారని చెప్పారు. ఫార్మసీ విభాగాధిపతి కోరిన మీదటే ఔట్‌సోర్సింగ్‌లో టెక్నికల్ ఆఫీసరును నియమించామని చెప్పారు.

22న ప్రసవం అయ్యేలా చూడండి

- వైద్యులను కోరుతున్న జంటలు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజు తమకు బిడ్డ పుట్టాలని చాలా మంది జంటలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. నెలలు నిండి ప్రసవానికి దగ్గరగా ఉన్నా గర్భిణులు తమకు సోమవారం ప్రసవం జరిగే అవకాశం ఉంటే పరిశీలించాల్సిందిగా వైద్యులను కోరుతున్నారు. గ్రేటర్‌లోని పలు ఆస్పత్రులకు ఇలాంటి వినతులు వస్తున్నట్లు తెలిసింది. నెలలు నిండిన తన భార్యకు సరిగ్గా అదే ముహూర్తంలో ప్రసవం చేయాలని ఓ జంట సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యులను కోరారు. ఈ మేరకు షాద్‌నగర్‌కు చెందిన ఆ జంట ఇప్పటికే అడ్మిషన్ కూడా తీసుకున్నారని గైనకాలజిస్టు డాక్టర్ నిర్మల తెలిపారు. ఆమెకు ప్రసవ సమయం దగ్గర పడడం, ఎలాంటి సమస్యలు లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం సరిగ్గా 12.20 గంటలకే ప్రసవం అయ్యేలా చూడాలని వైద్యులను కోరినట్లు చెప్పారు. మరొకరు కూడా అడిగినా, ఆమెకు కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఉండడంతో రెండు రోజులు ముందుగానే ప్రసవం చేయాల్సి వచ్చిందని డాక్టర్ నిర్మల చెప్పారు.

పేషెంట్లు లేకుండానే ప్రిస్క్రిప్షన్లు..!

- అనుమతులు లేకుండా మత్తు ఇంజెక్షన్లు
- రూ.57 ఇంజక్షన్ రూ.5 వేలకు విక్రయం
- సమీర్ హాస్పిటల్‌లో అధికారుల తనిఖీ
- ఛైర్మన్, డైరెక్టర్ సహా.. ఐదుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆసిఫ్‌నగర్‌లోని సమీర ఆస్పత్రిలో పేషెంట్లు లేకుండానే ప్రమాదకరమైన, అధిక మత్తునిచ్చే మందుల ప్రిస్క్రిప్షన్లు రాస్తున్న విషయం శనివారం వెలుగు చూసింది. తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు రెండు రోజుల క్రితం ఆసిఫ్‌నగర్‌లోని అనస్తీషియా డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఇంటిపై దాడిచేసిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన నార్కొటిక్ పోలీసులు.. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో కలిసి డాక్టర్ ఆశన్‌ముస్తఫాఖాన్ పనిచేస్తున్న సమీర్ హాస్పిటల్‌పై శనివారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడ పాత తేదీలతో (22-12-2023) సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ షేక్ సలీమ్ రాసిన ప్రిస్క్రిప్షన్‌తో కూడిన మందుల చీటీలను పోలీసులు గుర్తించారు. శ్వాసకోశ, హెచ్ఐవీ, టీబీయా బోన్ ఫ్యాక్చర్, హెర్నియా, హిస్టరెక్టమీ తదితర బాధితులకు వినియోగించడానికి 100 ఫెంటానిల్ ఇంజక్షన్లు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లో రాసినట్లు అధికారులు గుర్తించారు. వాటిలో 17 ఇంజక్షన్లు ఆస్పత్రి యాజమాన్యం వినియోగించినట్లు రిజిస్టర్‌లో రాశారు. కానీ, అందుకు సంబంధించిన పేషెంట్ల వివరాలు మాత్రం లభించకపోవడం గమనార్హం. ఈ ఏడాది జనవరి 6న అనస్తీషియా డాక్టర్ ఆశన్ ముస్తఫాఖాన్ భార్యకు మరో 100 ఇంజక్షన్లు అందినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటికే 43 విక్రయించగా.. 57 ఇంజక్షన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మత్తు ఇంజక్షన్ల ధర కేవలం రూ.57 మాత్రమే. అయితే, వాటిని డ్రగ్స్ వినియోగదారులకు రూ.ఐదు వేల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.



పట్టుబడిన ఇంజక్షన్లు(ఫైల్)

ఎన్డీపీఎస్ అనుమతులు లేకుండా..

అధిక మత్తును కలిగించే ఫెంటానీల్ సిట్రేట్ ఇంజక్షన్లు ఆస్పత్రిలో పేషెంట్లకు వినియోగించాలంటే ఆ ఆస్పత్రికి ఎన్డీపీఎస్ లైసెన్స్-2 అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండానే మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్నట్లు నార్కొటిక్, డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. వీటిని మెడికేర్ ఫార్మా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్‌కు ఎన్డీపీఎస్ లైసెన్స్-1 అనుమతులు ఉండాలి. కానీ, మెడికేర్ ఫార్మాకు అలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మత్తు ఇంజక్షన్లను సరఫరా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. వీటిని అక్రమంగా వినియోగిస్తున్న సమీర్ హాస్పిటల్ ఛైర్మన్ సోయబ్ సుభానీ, డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ముజీబ్, ఫార్మాసిస్టు సయ్యద్ నజీరుద్దీన్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ మహ్మద్ జాఫర్, మెడికేర్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్ గోపు శ్రీనివాస్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



గైర్హాజరు టీచర్లపై వేటు..!

- డిసెంబర్ 30 వరకు గడువు ఇచ్చినా స్పందించని వైనం
- తొమ్మిది మందిలో ఒకరి నుంచే సమాధానం

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులపై త్వరలో వేటుపడనుంది. ఈ మేరకు గెజిట్ ద్వారా వారిని విధుల నుంచి పూర్తిగా తొలగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ఉర్దూ మీడియం స్కూళ్లలో పనిచేస్తున్న 9 మంది ఎస్‌జీటీలు సంవత్సరాల తరబడి విధులకు డుమ్మా కొడుతున్నారు. ఏకంగా 5 నుంచి 15 ఏళ్లకు పైగా వారు ఎక్కడున్నారో కూడా విద్యాశాఖ వద్ద సమాచారం లేదు. దీంతో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్) ద్వారా పలుమార్లు నోటీసులు పంపించారు. అయినా, వారు స్పందించలేదు. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ తెలంగాణ రాజపత్రంలో కూడా ప్రచురించినా ఎక్కడ ఉన్నది విద్యాశాఖకు తెలియజేయని పరిస్థితి. దీంతో 9మంది టీచర్లకు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి గతేడాది డిసెంబర్ 30 వరకు గడువు ఇచ్చారు. అయితే, ఇందులో కేవలం బండ్లగూడ-2లోని జీపీఎస్ కందికల్‌గేట్‌కు చెందిన హూర్‌భానూ మాత్రమే స్పందిస్తూ తనను విధుల్లోకి తీసుకోవాలని కొన్ని రోజుల క్రితం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గెజిట్ ద్వారా మిగిలినవారిని త్వరలో విధుల నుంచి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

పాస్‌పోర్ట్ అదాలత్‌కు స్పందన..


బారులు తీరిన దరఖాస్తుదారులు

సికింద్రాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసి చాలా రోజులైనప్పటికీ పాస్‌పోర్ అందని వారి సౌకర్యార్థం హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం నిర్వహించిన పాస్‌పోర్ట్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చింది. దరఖాస్తు ఫారం సక్రమంగా భర్తీ చేయకపోవడం, అవసరమైన డాక్యుమెంట్లు జత చేయకపోవడం తదితర కారణాల వలన పాస్‌పోర్ట్ అందని వారు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని అధికారులు ముందుగానే ప్రకటించడంతో శనివారం సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అదాలత్ కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. సెలవు రోజైన శనివారం నిర్వహించడంతో దరఖాస్తుదారులు ఉదయం నుంచే పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద బారులు తీరారు. ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ ఆధ్వర్యంలో కార్యాలయంలో 10 ప్రత్యేక కౌంటర్లలో పౌరుల దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 800 దరఖాస్తుదారులు వచ్చారని, పాస్‌పోర్ట్ జారీ కాకపోవడానికి గల కారణాలను వారికి వివరించినట్లు ఆమె తెలిపారు. కాగా అవసరమైన డాక్యుమెంట్లు తీసుకువచ్చిన వారి దరఖాస్తులు క్లియర్ చేస్తామని జొన్నలగడ్డ స్నేహజ తెలిపారు. ఇదిలా ఉండగా ఆన్‌లైన్ ద్వారా అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా పాస్‌పోర్ట్ అదాలత్‌కు నేరుగా అనుమతించడంపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



బషీర్‌బాగ్ నిజాం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన భూమి పూజలో రాజ్య సభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్ జీ, శేఖర్, తదితరులు

చాంద్రాయణగుట్ట/రాజేంద్రనగర్/అఫ్జల్‌గంజ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కేశవగిరిలోని రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. లతా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట, చార్మినార్ ఏసీపీలు మనోజ్‌కుమార్, రుద్రభాస్కర్ పాల్గొన్నారు. గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి కోదండ రామస్వామి ఆలయంలో బీజేపీ నాయకులతో కలిసి స్వచ్ఛతీర్థ నిర్వహించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. సోమవారం ఉదయం అభిషేకం, లలిత సహస్రనామం రామనామ పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు కొంపల్లి భరద్వాజ్, నవీన్, కల్యాణ్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బీజేపీ నాయకులు వై.శ్రీధర్, జి.బాబురావు, పులిమామిడి రవీందర్, బండారు బాలకృష్ణ, సందీప్ ముదిరాజ్, నాగులపల్లి స్వామి, కిరణ్‌గౌడ్, జ్ఞానేశ్వర్ శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. రాముడి ప్రాముఖ్యత, రామమందిర నమూనాలతో కూడిన బ్యానర్లను ఉత్సవాలు ముగిసే వరకూ తొలగించవద్దని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్‌కు జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ జి.శంకర్ యాదవ్, కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్, బోయిని దర్శన్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



నుమాయిష్‌లో అయోధ్య మందిర నమునా ప్రారంభంలో హనుమంత్‌రావు, రాజేందర్ కుమార్, సత్యేందర్, సుధాకర్

నుమాయిష్‌లో 'అయోధ్య' నమూనా..

సుధా కార్స్ మ్యూజియం నిర్వాహకుడు సుధాకర్ నేతృత్వంలో అయోధ్య మందిర నమునా వాహనాన్ని తయారు చేసి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రదర్శనకు ఉంచారు. దీనిని ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరీ బి.హనుమంత్‌రావు జాయింట్ సెక్రటరీ చంద్రజిత్‌సింగ్, కోశాధికారి రాజేందర్ కుమార్, ఉపాధ్యక్షులు సత్యేందర్, సురేందర్ రెడ్డి, మన్‌దీప్‌రెడ్డి, వనం సురేందర్, జి.వి.రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు.

కరసేవలో పాల్గొన్నా..



రాజేంద్రనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీ రామ మందిర నిర్మాణం పూర్తయి 22న ప్రారంభానికి సిద్ధం కావడం సంతోషకరమని రాజేంద్రనగర్ సర్కిల్ గాంధీనగర్‌కు చెందిన డి.సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. తాను 15వ యేట నుంచే ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్నానని, ఆ తర్వాత బీజేపీలో చేరి 1990లో కరసేవలో పాల్గొన్నానని తెలిపారు. రామజన్మభూమికి ఎన్నో వ్యయ ప్రయాసలు పడి వెళ్లి కరసేవలో పాల్గొన్నామన్నారు. ఆ నాడు దేశంలోని అనేక మంది పడ్డ శ్రమకు నేడు ఫలితం దక్కిందన్నారు.

రేపు శ్రీరామ పట్టాభిషేకం

బంజారాహిల్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని విశాఖ శారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవసన్నిధానంలో కోదండరామస్వామి దేవాలయంలో 22వ తేదీ వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సినీనటుడు, ఆలయ చైర్మన్ డాక్టర్ మోహన్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం మన్యుసూక్త సహిత హనుమాన్ గాయత్రిహోమం, రామాయణం ఉత్తర కాండ ప్రవచనం నిర్వహించినట్లు వివరించారు. 21న సీతారామస్వామి మూల విరాట్‌కు విశేష నదీసాగర జలాలతో అభిషేకం అనంతరం సీతారామస్వామి శాంతి కల్యాణం, 22న సప్తవిధ పుష్పార్చన, సీతరామ నగర రథ యాత్ర, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ వేడుకల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశం సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, ఆలయ పాలక మండలి కోశాధికారి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, నటుడు బాలాజీ, నిర్మాత ఆదిశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సినీనటుడు, ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్ డాక్టర్ మోహన్‌బాబు



మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VIR5OTy లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



బయోడైవర్సిటీ పార్కులో మొక్క నాటుతున్న డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల్లో
హైకోర్టు భవనాలు వద్దు

- బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

రాజేంద్రనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాల భూమిని కొత్త హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 55ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విశ్వవిద్యాలయం ఎదుట 12 రోజులుగా ధర్నా చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను బలవంతంగా గుంజుకుని హైకోర్టుకు కేటాయించడం అంటే వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కి, గ్రామీణ ప్రాంత యువతకు విద్యను దూరం చేయడమే అని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పర్యటించి విద్యార్థులతో చర్చలు జరిపితే తప్ప సమస్య వారికి అర్థం కాదన్నారు. హైకోర్టు నిర్మాణానికి బీఎస్పీ వ్యతిరేకం కాదన్నారు. వర్సిటీ భూముల్లో కాకుండా ఇందిరాపార్కు, బయోడైవర్సిటీ పార్కుల్లో హైకోర్టు నిర్మాణం చేయాలని సవాలు విసిరారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే న్యాయస్థానానికి చెప్పుకుంటామన్న ఆయన.. హైకోర్టు కోసం వ్యవసాయ వర్సిటీ భూములు తీసుకుంటుంటే ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం జీవోని ఎత్తేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకనంద సేవా పురస్కారంతో లాల్‌దర్వాజా మేకలబండ ప్రాంతానికి చెందిన పోసాని సుధాకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, బొగ్గారపు దయానంద్, సినీనటుడు బాబుమోహన్, రాజ్‌నారాయణ్ ముదిరాజ్, తదితరులు

- యాకుత్‌పుర, ఆంధ్రజ్యోతి

బహదూర్‌పుర అభివృద్ధిపై కమిషనర్‌తో చర్చ

బహదూర్‌పుర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో బహదూర్‌పుర శాసనసభ్యుడు మహ్మద్ ముబీన్, ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ బేగ్‌లు శనివారం సమవేశమయ్యారు. బహదూర్‌పుర నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు.



రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం ఇస్తున్న ముబీన్, మీర్జా రెహమత్ బేగ్

వంశీరామరాజుకు కామరాజుగడ్డ బాబురావు పురస్కారం

రవీంద్రభారతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక రంగంలో వంశీరామరాజు చేసిన సేవలు అభినందనీయమని జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీదత్త సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కామరాజుగడ్డ బాబురావు, సీతారావమ్మ గిరిజ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు వంశీరామరాజుకు కామరాజుగడ్డ బాబురావు పురస్కారం, డా.తెన్నేటి సుధాదేవికి గిరిజ పురస్కారాలను ప్రదానం చేశారు. జస్టిస్ రామలింగేశ్వరరావు పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రచయిత్రి కామరాజుగడ్డ వాసవదత్త రమణ రచించిన పాశం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగానికి కా మరాజుగడ్డ కుటుంబం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఆవుల మంజులత, గడ్డార్లి అశోక్‌బాబు, సత్యవోలు సుందరసాయి, ఎస్వీ రామారావు తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతల్ని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పాశం రచయిత్రి వాసవదత్త రమణను సత్కరించి అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆబిడ్స్ వ్యభిచారం కేసులో
అఖిల్ పహిల్వాన్ అరెస్ట్

- ఏ1గా చేర్చి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అఖిల్ పహిల్వాన్

మంగళ్‌హాట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్‌లో ఓ హోటల్‌ను అద్దెకు తీసుకొని గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తూ పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులో ఇప్పుడు నగరంలోని రాంనగర్‌కు చెందిన అఖిల్ పహిల్వాన్ పేరు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాజకీయ పార్టీల్లోని ముఖ్య నేతలకు ఆయన సుపరిచితుడు. అలాంటి వ్యక్తి విదేశాల నుంచి యువతులకు ఉద్యోగాల పేరుతో ఎరవేసి నగరానికి రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడని విచారణలో తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాంనగర్ ప్రాంతానికి చెందిన అఖిల్ పహిల్వాన్(35) కొంతకాలంగా ఆబిడ్స్‌లోని ఓ భవనాన్ని లీజుకు తీసుకొని హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆ హోటల్‌లో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 19వ తేదీ రాత్రి దాడులు నిర్వహించి 16 మంది యువతులను, నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులు అఖిల్ పహిల్వాన్‌తో పాటు మేనేజర్లను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, అఖిల్ పహిల్వాన్ విదేశీ యువతుల చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లను సైతం తన వద్ద పెట్టుకొని వారిని వేధించినట్లు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాంనగర్‌లో ఉత్సవాలు నిర్వహించడం, కుస్తీ పోటీలు నిర్వహించి వాటి ద్వారా మంచి పబ్లిసిటీ సంపాదించిన సదరు వ్యక్తికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లలోని అనేక మంది ముఖ్య నేతలతో సన్నిహిత్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసును మరింత చాలెంజింగ్‌గా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, యువతులను స్టేట్ హోంకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుతుబ్‌షాహీలో హెరిటేజ్ వాక్



మాట్లాడుతున్న పీటర్ ఎల్‌బర్స్, రోహిణి బాటియా

కార్వాన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇండిగోరీచ్ ఇంటర్ గ్లోబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కుతుబ్‌షాహీలో 5వ హెరిటేజ్ వాక్‌ను శనివారం నిర్వహించారు. మై సిటీ, మై హెరిటేజ్ వాక్ పేరుతో దేశంలోని వారసత్వం, సంస్కృతి, ప్రాముఖ్యతల గురించి అవగాహన కల్పించేందుకు ఈ వాక్‌ను నిర్వహించారు. ఈ వాక్‌కు ముఖ్య అతిథిగా ఇండిగో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి పీటర్ ఎల్‌బర్స్, ఇంటర్ గ్లోబ్ ఫౌండేషన్ చైర్మన్ రోహిణి బాటియాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ ప్రధాన పర్యాటకకేంద్రం కలకాలం నిలిచిపోయే ఆర్కిటెక్చర్ అన్నారు. సాంకేతిక పురోగమణాలు, గొప్ప సాంస్కృతిక సుందరమైన అందాలకు ప్రసిద్ధి చెందిందని ప్రశంసించారు. ఇండిగో హైదరాబాద్ 54 దేశీయ, 13 అంతర్జాతీయ గమ్యస్థానాలను కలుపుతోందని గుర్తు చేశారు. నగరం గొప్ప చరిత్రకు సాక్ష్యంగా నిలిచిందని, మధ్యయుగ శైలురాళ్ల అన్వేషణ, పరిరక్షణకు సహకరించేందుకు తాము సంతోషిస్తున్నామని తెలిపారు. భారత్‌లో ఎక్కువగా ఇష్టపడే పర్యాటక ప్రాంతాలను బలోపేతం చేయడం, హైదరాబాద్ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచం మొత్తం తెలిసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్ గ్లోబ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత బోధనేతర ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, పెంటయ్య, టి.వెంకటేశ్వర్లు, షేక్ మౌలాన, జి.కృష్ణ, తాహెర్‌ఖాన్, కె.యాదయ్య, వి.సత్తయ్య, యాదయ్య, కె.అనంతయ్య, కె.ప్రభుదాస్, పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు

- రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి



ఏరియల్ యాక్ట్‌లో నుంచి కిందపడుతున్న వెస్టెక్స్ కంపెనీ సీఈవో, ప్రెసిడెంట్

రామోజీఫిల్మ్ సిటీ ప్రమాదంపై దర్యాప్తు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర శివారు రామోజీ ఫిల్మ్ సిటీలో గురువారం రాత్రి వెస్టెక్స్ ఏషియా కంపెనీ సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో జరిగిన ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. ఘటనలో ఆ కంపెనీ సీఈవో సంజయ్‌షా మృతి చెందగా..ప్రెసిడెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ప్రమాదానికి గల కారణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీఫులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అసలు ఏరియల్ యాక్ట్ తీగలు తెగడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఈవెంట్ నిర్వహాకులు నిర్లక్ష్యంపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, స్టేజీపై ఏరియల్ యాక్ట్ ఏర్పాటు చేసిన క్రమంలో రూఫ్ క్లాంపులను సరిగ్గా అమర్చకపోవడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణ కోసం ఆర్అండ్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీ శాఖల అధికారులను కోరినట్లు తెలిసింది. అయితే, శుక్రవారం ఆర్అండ్‌బీ ఈ ఘటనా ప్రదేశాన్ని పరిశీలించినట్లు తెలిసింది. రెండు శాఖల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలిసే అవకాశం ఉంది.

సీఈవో మృతదేహం అప్పగింత

ప్రమాదంలో మృతిచెందిన కంపెనీ సీఈవో సంజయ్‌షా మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ప్రత్యేక కార్గో విమానంలో మృతదేహాన్ని ముంబైకి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన కంపెనీ ప్రెసిడెంట్ రాజ్‌దాట్ల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది.

గంజాయి విక్రేత అరెస్ట్

రాజేంద్రనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 294 వద్ద శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మెహిదీపట్నం నుంచి శివరాంపల్లికి బైక్(ఏపీ13ఏఎ4510)పై వెళ్తున్న వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన రిషిరాజ్‌కుమార్(24)ను ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద 485 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

గురువుల బోధనతో ప్రగతికి బాటలు

- ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ చూడామణి



మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ టి.కె. చూడామణి

అల్వాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లౌకికంగా కాని ఆధ్యాత్మికంగాని పురోగతిని పొందాలంటే సద్గురువుల మార్గదర్శనం తప్పక లభించాల్సిందేనని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త డాక్టర్ టి.కె. చూడామణి అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు, ప్రచారానికి జీవితకాలం కృషి చేసిన స్వామినాథ దేశిక, శ్రీరంగ శఠకోప దేశిక, వెంకట నరసింహ దేశికుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ఠ ఉపన్యాస కార్యక్రమానికి రెండో రోజు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ రంగంలో రాణించాలన్నా , ఆయా రంగాల్లో నిష్ణాతులైన గురువుల బోధనలను శ్రద్ధగా విని, వాటిని ఆచరించాలి. అప్పుడే ప్రగతిపథంలో పయనించగలుగుతామని చూడామణి పేర్కొన్నారు. నిర్వాహకులు సముద్రాల శఠగోపాచార్య మాట్లాడుతూ తరతరాలకు చెరగని నిధిగా విజ్ఞాన సంపదను మన పూర్వికులైన ఆచార్యులు సమాజానికి గ్రంథస్థం చేసి సురక్షితంగా అందించారని, వాటిని అధ్యాయనం చేసి ఆదర్శవంతమైన జీవనాన్ని గడుపాలన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆదునిక యువతకు అందించేందుకు తాను 15 గ్రంథాలను రచించానని, ప్రముఖ దిన పత్రికలలో వ్యాసాలను రచిస్తూ కాలమిస్ట్‌గా బాధ్యతలు కొనసాగిస్తున్నాని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు రసజ్ఞులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షణ పథకం కో-ఆర్డినేటర్లు

సమగ్ర శిక్షణ కో-ఆర్డినేటర్ల నిరసన

రాజేంద్రనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐఆర్‌డీ ఎదుట శనివారం సమగ్ర శిక్షణ పథకంలో పనిచేస్తున్న రాష్ట్రంలోని 33 జిల్లాల కో ఆర్డినేటర్లు నిరసన తెలిపారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వకుండా మూడు నెలల నుంచి పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు కో ఆర్డినేటర్లకు జూమ్ కాల్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వేతనాలతో పాటు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బిల్లులతో పాటు మెడికల్ బిల్లులను కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. సరైన సమయానికి నిధులు చేరకుంటే పిల్లలకు నాసిరకమైన అహారం పెడితే పిల్లలకు ఇబ్బందులు కలుగుతాయని, పై అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డీఈఓ, డీపీవోలు మాట్లాడే వైఖరిని మార్చుకోవాలని ఎన్నిసార్లు పై అధికారులు చెప్పినా వారు దురుసుగానే మాట్లాడుతున్నారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

రంజిత్‌రెడ్డి దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటిలోనూ పాత్రధారే
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్ల దాణ, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపించారు. లక్షీకపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవియాదవ్ తదితరులు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్పా ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక సమస్యలపై అవగాహన లేదని అన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మాత్రమే ఆయనకు తెలుసని విమర్శించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫామ్‌హౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడా రంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేక భూదందాలు చేశారని, వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని వారు హితవు పలికారు. లేదంటే తగిన శాస్తి చేయాల్సి ఉంటుందని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వరెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఒక గ్రామ సర్పంచ్‌కి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. డబ్బు, హోదాను చూసి అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

